## క్లుప్తంగా

### మోదీ మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నేతలు



**గుంటూరు మెడికల్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 101వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రముఖ సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గొప్పతనాన్ని ప్రధాని మన్ కీ బాత్‌లో ప్రస్తావించడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ మహోన్నత వ్యక్తిత్వం కలవారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలపాటి రవికుమార్, తాడువాయి నాగరామకృష్ణ, భీమినేని చంద్రశేఖర్, కోలా రేణుకాదేవి, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, కుమార్ గౌడ్, పాండురంగ విఠల్, కన్నెగంటి శ్రీనివాస్, దేసు సత్యనారాయణ, పార్లమెంట్ విస్తారక్ రమేష్ పాల్గొన్నారు.

### ఉచిత నీట్ శిక్షణ తరగతులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** నీట్‌పై విద్యార్థినులకు జూన్ 3,4,5 తేదీల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మెటా మైండ్ నీట్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ దోమలగూడలోని రామకృష్ణ మఠం పక్కనున్న అకాడమీలో ప్రత్యేకంగా బాలికల కోసం ఉచిత హాస్టల్ వసతితో నిర్వహించే శిక్షణ తరగతుల్లో భాగంగా నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, టెస్ట్ సిరీస్, నూతన ప్రిపరేషన్ విధానం ద్వారా మెరుగైన ర్యాంకు సాధనపై సీనియర్ అధ్యాపకులు, విషయ నిపుణులతో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థినులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 85229 58575, 70322 64910 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

**నెహ్రూనగర్:** ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన ఉంటుందన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం 8.30 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజు సచివాలయాల్లోనూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా అక్కడ కూడా అర్జీల్ని అందజేయవచ్చని అదనపు కమిషనర్ తెలియజేశారు.

### నేడు ఎన్టీఆర్ స్మారక పురస్కారాల ప్రదానం

**పాత గుంటూరు:** ఎన్టీఆర్ శత జయంతి పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళా వేదికపై సోమవారం సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో పలువురు విశిష్ట వ్యక్తులకు ఎన్టీఆర్ స్మారక పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు యువ కళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభలో ప్రముఖ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్, సినీ నటులు ఆలపాటి లక్ష్మి, గోపరాజు రమణ, డాక్టర్ పి.వి.ఎస్.కృష్ణకు పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ అనంతరం 'నాన్న నేనొచ్చేస్తా' సాంఘిక నాటిక ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

### దళిత, ప్రజా సంఘాల నిరసన

**నెహ్రూనగర్:** నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానం లేకపోవడం సిగ్గుచేటని దళిత, ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. ఆదివారం లాడ్జి సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రపతి ముర్మును పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఇది దేశంలోని అత్యధిక శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్ని అవమానపరచడమేనని తెలిపారు. రాజ్యాంగ వ్యతిరేక, అప్రజాస్వామిక, అధిపత్య కుల, మతోన్మాద చర్యల్ని ప్రజల్లోకి విస్తృత ప్రచారం చేసి తగిన గుణపాఠం చెబుతామని చెప్పారు. కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు వై. కోటేశ్వరరావు(వైకే), జి.ఆర్.భగత్‌సింగ్, పి.వి.రమణయ్య, ఉన్నం సాంబశివరావు, నీలాంబరం, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### వడదెబ్బకు వ్యక్తి మృతి

**పట్నంబజారు:** వడదెబ్బకు వ్యక్తి మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. బాలాజీనగర్‌కు చెందిన కోసూరి నాగరాజు (44) శనివారం వడదెబ్బకు గురికావడంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చూపించి ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం బాగా ఇబ్బంది పడుతుండటంతో మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# క్రైస్తవ హక్కులను పరిరక్షించాలి




కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న ఫాదర్లు, క్రైస్తవులు

**పాత గుంటూరు:** దేశంలో క్రైస్తవులకు రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఫాదర్ డాక్టర్ బాలస్వామి కోరారు. మణిపూర్‌లో ఈ నెల 3న క్రైస్తవ ఆలయాలు, క్రైస్తవులపై జరిగిన హింసాకాండకు నిరసనగా ఆదివారం లక్ష్మీపురం సర్కిల్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద క్రైస్తవులు క్యాండిల్స్‌తో సామూహిక మౌన ప్రదర్శన చేశారు. ఫాదర్ సుందరరాజు మాట్లాడుతూ క్రైస్తవుల హక్కుల్ని ప్రభుత్వం పరిరక్షించాలని, మణిపూర్‌లో దాడుల్ని నిరోధించాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్లు జ్యోతిరాజు, ఏరువబాల, బోసు, బాలశౌరయ్య, క్రైస్తవులు పాల్గొన్నారు.

## ప్రణవ పీఠం సభ్యుల సేవలు అభినందనీయం

**పట్నంబజారు:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) చెప్పారు. ప్రణవ పీఠం సభ్యుల ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రంలో ఆదివారం గుడి–బడి కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని ప్రణవ పీఠం సభ్యులు శుభ్రపరిచారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేట్ ఆచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం ఏర్పడేలా, స్ఫూర్తిని కలిగించేలా గుడి– బడి సభ్యుల సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రతి ఆదివారం ఒక ఆలయాన్ని ఎంచుకుని ఇటువంటి సేవా కార్యక్రమాల్ని చేపట్టడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. తన వంతుగా ఆలయాల్ని శుభ్రపరిచేందుకు రెండు మోటార్ పంపులు అందజేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం కార్పొరేట్ ఆచారి కొద్దిసేపు గుడి బడి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రణవ పీఠం సభ్యులు ఉషారాణి, పావని, దుర్గ, హైమావతి, అమరవాణి, వంశీ, ఓంకార్, ప్రసాద్, గిరిధర్, రాఘవరావు, మురళీతో పాటు 30 మంది సభ్యులు పాల్గొన్నారు.



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ ఆచారి, పీఠం సభ్యులు

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని కెనడీ నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఎం.వి. రామచంద్రారెడ్డి, వి. చంద్రశేఖర్‌రెడ్డిని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకుడు పి. మాల్యాద్రి, ఆర్. చలపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ నాయకులు కె. మురళి, ఎస్. రామాంజనేయులు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ. ఖాసీం, ఉపాధ్యాయులు హసన్ బేగ్, యలమందరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని సత్కరిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ నాయకులు

## ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు

**గుంటూరు మెడికల్:** హోప్ విన్ హాస్పిటల్స్, యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రెడ్డిపాలెం మదర్‌థెరిస్సా కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా చేసి 300 మందికి మందులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ ప్రతి నెలా హాస్పిటల్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ వీటిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. రుతుక్రమం సమయంలో మహిళలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ బషీరుద్దీన్, డాక్టర్ రాహుల్‌రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, హాస్పిటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, మారుతీరావు, బాబు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ నజీరుద్దీన్

## మహిళా పోలీసులకు ఎమ్మెల్యే సుచరిత పరామర్శ

**ప్రత్తిపాడు:** ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సచివాలయ ఉద్యోగుల్ని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పరామర్శించారు. ప్రత్తిపాడు–1 సచివాలయం మహిళా పోలీస్ రజిని, గనికపూడి సచివాలయ మహిళా పోలీస్ భార్గవి శుక్రవారం సీఎం బందోబస్తుకు వెళ్లి తిరిగి ప్రత్తిపాడుకు స్కూటీపై వస్తూ గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రజిని, భార్గవీకి తీవ్ర గాయలయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరినీ ఆదివారం ఎమ్మెల్యే సుచరిత పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వెంట వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని, పార్టీ నాయకులు ఉన్నారు.



# 4 నుంచి వాలీబాల్ పోటీలు

**పెదనందిపాడు:** రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్ని 4వ తేదీ నుంచి పెదనందిపాడులో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి పలు పోటీల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు దాసరి గోవిందు (6303138147), మేడిద శాంతిబాబు (7842588058)ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశింపీరా, సర్పంచ్ దాసరి పద్మారావు, ఏబీపాలెం సొసైటీ అధ్యక్షుడు కె. భూషయ్య, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

# వైభవంగా బ్రహ్మోత్సవాలు

**పెదకాకాని:** నంబూరులోని శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మహాలక్ష్మి హోమం, వరాహ అవతార వేంకటేశ్వర యజ్ఞం, సింహ వాహనంపై వరాహ స్వరూప ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. సాయంత్రం 6గంటలకు నరసింహ అవతార వేంకటేశ్వర యజ్ఞం, నరసింహ అవతార వాహన ఉత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం లక్ష్మి సుదర్శన హోమం, ఉదయం 10 గంటలకు వామనావతార వేంకటేశ్వర యజ్ఞం, వామనావతార స్వరూప హనుమంత వాహన ఉత్సవం, సాయంత్రం 6గంటలకు పరుశురామ అవతార వేంకటేశ్వర యజ్ఞం, పరుశురామ స్వరూప హనుమంత వాహన ఉత్సవం, రాత్రి 8గంటలకు శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.



పూలజందుకుంటున్న ఉత్సవమూర్తులు

### అలరించిన 'ఎన్టీఆర్ సూపర్ హిట్స్'



**పాత గుంటూరు:** ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శ్రీశుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో 'ఎన్టీఆర్ సూపర్ హిట్స్ 'పేరున ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు, వెంకాయమ్మ పాల్గొన్నారు. ఎన్టీఆర్ నటించిన పలు చిత్రాలలోని మధురమైన పాటల్ని గాయకులు పురుషోత్తమ ప్రసాద్, చీకటి రవికాంత్, దొప్పలపూడి శ్రీనివాసరావు, పత్రి గాయత్రీదేవి, అత్తోట సౌజన్య ఆలపించారు. కార్యక్రమాన్ని సంస్థ సభ్యులు సిరిగిరి గణేష్, కమలికంటి వలి, కొయ్యలమూడి బాలస్వామి, తుమ్మేటి శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాసరావు , పాగళ్ల మోహనరావు, దక్కుమళ్ల ఆదాము, మురళి పర్యవేక్షించారు.

### మైనింగ్ ప్రాంతంలో ప్రజల రక్షణకు చర్యలు తీసుకోవాలి

**ప్రత్తిపాడు:** మైనింగ్ జరిగిన ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ప్రాణాపాయం లేకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి కోరారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో జగనన్న హౌసింగ్ లే అవుట్‌కు సమీపంలో కొందరు గ్రావెల్ త్రవ్వకాలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అక్రమ మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. జగనన్న హౌసింగ్ లే అవుట్‌లో నిర్మించుకున్న ఇళ్లకు కేవలం పది మీటర్ల దూరంలో, ఎనిమిది తొమ్మిది అడుగుల లోతులో గ్రావెల్ త్రవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మైనింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలతో పాటు అక్కడ నివసిస్తున్న వారికి ప్రాణాపాయం లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను ఫోన్ ద్వారా కోరినట్లు జెడ్పీటీసీ తెలిపారు. ఇకపై ఇక్కడ మట్టి తవ్వకాలు జరగకుండా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### ఇంట్లో చోరీ

**గుంటూరు రూరల్:** తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన గుంటూరు రూరల్ నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పాదిలి తిరుపతిరావు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ గుంటూరు నగరంలో నివసిస్తున్నాడు. నరసరావుపేటలోని బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి అక్కడకు వెళ్లారు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని వంద గ్రాముల బంగారం, ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్లు, రూ. 5వేలు ఎత్తుకుపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తిరుమలరావు లోపలకు వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

# 'కర్మయోగి' పుస్తకావిష్కరణ

**పాత గుంటూరు:** భారతీయ సనాతన వైదిక జీవన విధానానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచి తమ జీవితాల్ని సార్థకం చేసుకున్న నిజమైన నిష్కామ కర్మయోగులు బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులని మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధ్యాన మందిరంలో తెనాలి పావులూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ ఆదర్శ జీవన యానం లఘు చిత్ర ప్రదర్శనతో పాటు ఆయనపై రాసిన 'కర్మయోగి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పాల్గొన్నారు. యలమంచిలి శివాజీ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల బొల్లేపల్లి సత్యనారాయణ దంపతుల ఆధ్యాత్మిక, ధార్మిక జీవనం వర్తమాన సమాజానికి ఆదర్శనీయమని కొనియాడారు. సభను పావులూరి ట్రస్ట్ చైర్మన్ పావులూరి శ్రీనివాసరావు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొమ్ము ఉమామహేశ్వరరావు, వెంపటి సత్యనారాయణ, డాక్టర్ డి.ఎస్. దీక్షిత్, డాక్టర్ కోగంటి రంగనాయకి, కూర్మనాథస్వామి, పారిశ్రామికవేత్తలు చుక్కపల్లి రమేష్, బలరామకృష్ణయ్య, సామినేని కోటేశ్వరరావు, వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో మాజీ ఎంపీలు శోభనాద్రీశ్వరరావు, యలమంచిలి శివాజీ తదితరులు

# కవుల సందేశాల్ని పట్టించుకోని సమాజం

అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్

**పాత గుంటూరు:** కవులు చెప్పే నీతి వాక్యాల్ని, సందేశాల్ని పట్టించుకునే స్థితిలో నేటి సమాజం లేదని, ఈ విషయాన్ని రచయితల సంఘాలు గుర్తించి అందుకు పరిష్కార మార్గాల్ని అన్వేషించాలని అరసం రాష్ట్ర కార్యదర్శి, సుప్రసిద్ధ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం, డాక్టర్ పట్టాభి కళాపీఠం ఆధ్వర్యంలో 'కవి మిత్రుల కలయిక–కవి సమ్మేళనం' నిర్వహించారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సభలో ముఖ్య అతిథిగా వల్లూరు శివప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు గుంటూరుతో ఉన్న అనుబంధాన్ని సభికులతో పంచుకున్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ సాహితీ సంఘాల విస్తరణకీ, చీల్చివేతకు తేడా తెలియని అజ్ఞానం సాహితీ రంగాన్ని పట్టి పీడిస్తోందని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ జోస్యుల కృష్ణబాబు రచించిన కాళ్లకూరి నారాయణరావు నాటకత్రయ సమాలోచనం పుస్తకాన్ని రచయిత వై.హెచ్.కె.మోహన్‌రావు సమీక్షించారు. కవి సమ్మేళనంలో గోలి హనుమశాస్త్రి, వెదుళ్లపల్లి సాంబశివరావు, సొపాటి ప్రభాకర్, దుర్గం సునీత, గడల శివప్రసాద్, తాటికోల పద్మావతి, డాక్టర్ కుమారస్వామి, బ్రహ్మాంజలి కవితాగానం చేశారు. అనంతరం వల్లూరు శివప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రావి రంగారావు, కందిమళ్ల శివప్రసాద్, శరత్ ప్రమోద్ ఎల్వీ, దినవహి సత్యవతి, గోలి విజయ, బి. జనార్ధనరెడ్డి, బండికల్లు జమదగ్ని పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సయ్యద్ జానీ బాషా, చొప్పా రాఘవేంద్ర శేఖర్ నిర్వహించారు.



వల్లూరు శివప్రసాద్‌ను సత్కరిస్తున్న కలిమిశ్రీ , సంఘ సభ్యులు

## ఉద్యోగోన్నతులను మాన్యువల్ కౌన్సెలింగ్‌లో నిర్వహించాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల్ని మాన్యువల్ కౌన్సెలింగ్‌లో నిర్వహించాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం. కళాధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫ్యాప్టో రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఆదివారం ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాల్ని సవరించాలని కోరుతూ డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతుల విషయంలో విద్యాశాఖ నిర్దిష్ట విధానాన్ని పాటించకుండా గందరగోళం సృష్టించడం తగదని పేర్కొన్నారు. ఉద్యోగోన్నతులకు ఖాళీల్ని చూపించకుండానే అంగీకారం కోరడం వల్ల ఎక్కువ మంది తిరస్కరిస్తున్నారని తెలిపారు. ఫ్యాప్టో కో–చైర్మన్ జి. మోహన్‌రావు మాట్లాడుతూ బదిలీలపై సంఘాలతో జరిపిన చర్చల్లో అంగీకరించిన విషయాలు ఉత్తర్వుల్లో లేవన్నారు. ఉత్తర్వుల్లో పొందుపర్చిన అంశాలు ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో లేవని పేర్కొన్నారు. ఫ్యాప్టో నాయకుడు కె. బసవ లింగారావు మాట్లాడుతూ ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలు, ఖాళీల్ని ముందుగా చూపి, మాన్యువల్‌గా నిర్వహిస్తే ఎటువంటి సమస్య ఉండదని తెలిపారు. బదిలీల ప్రభావం ఉపాధ్యాయులపై ఎనిమిదేళ్లు ఉంటుందని, ప్రక్రియ సక్రమంగా జరగని పక్షంలో ఎనిమిదేళ్లు నష్టపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. పోస్టుల్ని బ్లాక్ చేయరాదని కోరారు. అనంతరం డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. నిర్మలారాణికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బి. ఆదిలక్ష్మి, నరసింహారావు, ఖాలీద్, సీహెచ్. నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏడీ నిర్మలారాణికి వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

## సిటీ ఎలక్ట్రానిక్స్, టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ కార్యవర్గం

**నెహ్రూనగర్:** గుంటూరు సిటీ ఎలక్ట్రానిక్స్, టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అరండల్‌పేటలోని ఓ ఫంక్షన్ హాలులో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె. అజాజ్ అలీ, సెక్రటరీగా ఈ. శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కె. మెహబూబ్ బాషా, ట్రెజరర్‌గా బి. శ్రీనివాసరావు, కమిటీ సభ్యుడిగా కుర్రా రాజేష్‌ను ఎన్నుకున్నారు.

### లీకులకు శాశ్వత పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్

**నెహ్రూనగర్:** సాక్షిలో ప్రచురితమైన 'కాసులు కురిపిస్తున్న పైప్‌లైన్ లీకులు' కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి లక్ష్మీపురం వాటర్ ట్యాంకుల వరకు తాగునీటిని సరఫరా చేసే 800 డయా పైప్‌లైన్‌ను సంజీవయ్య నగర్ రైల్వే గేట్ వద్ద తరచూ లీకులు ఏర్పడటం.. ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో సంజీవయ్య నగర్ రైల్వే గేటు దాటిన తర్వాత నుంచి 800 డయా పైపులైను స్థానంలో 900 డయా పైప్ లైన్ రెండేళ్ల కిందట వేశారు. దీనికి అనుసంధాన పనులు ఫిబ్రవరిలో పూర్తి చేశారు. అయినా సంజీవయ్య నగర్ రైల్వే గేట్ వద్ద లీకులు పడుతూనే ఉన్నాయి. దీనికి పరిష్కారంగా నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి సంజీవయ్య నగర్ రైల్వే గేట్ వరకు 290 మీటర్ల 800 డయా పైపులైన్ స్థానంలో 900 డయా పైపులైన్ ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి. కానీ, ఇంజినీరింగ్ అధికారులు కొత్త పైపులైన్ వేయకుండా లీకులకు మరమ్మతులు చేయడంపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు సోమవారం ఉదయం 10 గంటలకు నూతన పైపులైను ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు.

### అన్నదానానికి వితరణ అభినందనీయం

**పెదకాకాని:** శివాలయంలో అన్నదానానికి భక్తుల సహాయ, సహకారాలు అభినందనీయమని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానంలో జూన్ 1 నుంచి 3 వరకు మహా కుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా భక్తుల అన్నదానానికి గానూ లక్ష రూపాయలను ఎన్టీఆర్ జిల్లా తిరువూరు శాంతీనగర్‌కు చెందిన కె.ప్రవీణ్ కుమార్, లక్ష్మీప్రసన్న దంపతులు ఏసీకి అందజేశారు. దాతలు కోరిక మేరకు మహా కుంభాభిషేకం పర్వదినాల్లో అన్నదానానికి నగదును వినియోగిస్తామని ఏసీ చెప్పారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు భక్తులు సహాయ, సహకారాలు అందజేయాలని ఆయన కోరారు.



విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**పెదకాకాని:** విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కొప్పురావూరు, నంబూరు రైల్వేస్టేషన్, టోల్గేట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీహెచ్. ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.